# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ రోజుతో ముగిశాయి.

❖ ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడానికి బిమ్‌స్టెక్ ఫోరమ్‌ను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన 4 ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది.

❖ వక్ఫ్ (సవరణ) బిల్లు, 2025 పై 17 గంటలకు పైగా రాజ్య సభలో చర్చ చేపట్టామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

====================

ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడానికి బిమ్‌స్టెక్ ఫోరమ్‌ను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బిమ్‌స్టెక్ సభ్య దేశాల మధ్య సహకారాన్నిపెంపొందించడానికి 21 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను ఈ సందర్భంగా ఆయన ప్రతిపాదించారు. బిమ్‌స్టెక్ కూటమి సముద్ర రవాణా ఒప్పందంపై సంతకం చేయడం, బిమ్‌స్టెక్ బ్యాంకాక్ విజన్ 2030ని స్వీకరించడాన్ని ప్రధానమంత్రి స్వాగతించారు.

====================

పార్లమెంటు ఉభయ సభలు ఈరోజు నిరవధికంగా వాయిదా పడ్డాయి. దీంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. జనవరి 31న సమావేశాలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభలో బడ్జెట్ సమావేశాల ముగింపు ప్రసంగంలో, సభాపతి ఓం బిర్లా మాట్లాడుతూ... బడ్జెట్ సమావేశాలలో సభ 118 శాతం ఉత్పాదకతను నమోదు చేసిందని వెల్లడించారు. ఈ సమావేశాలలో లోక్‌సభ 16 బిల్లులను ఆమోదించిందని తెలిపారు. మరోవైపు రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ... ఎగువ సభలో రికార్డు స్థాయిలో 49 ప్రైవేట్ సభ్యుల బిల్లులు

ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టబడ్డాయని తెలియజేశారు. మొత్తం 159 గంటలు పాటూ సభా కార్యకలాపాలు జరిగాయని జగదీప్ ధన్‌ఖర్ వెల్లడిస్తూ ...

(వాయిస్ 40 సెకన్లు)

====================

కేంద్ర మంత్రివర్గం ఈరోజు న్యూ ఢిల్లీలో సమావేశమయ్యింది. రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన 4 ప్రాజెక్టులకు మంత్రివర్గం ఈ సందర్భంగా ఆమోదం తెలిపింది. ఆ వివరాలను కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడిస్తూ... ఈ నాలుగు ప్రాజెక్టులు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని దాదాపు 1,247 కిలోమీటర్ల రైల్వే నెట్వర్క్ ను విస్తరిస్తాయని తెలిపారు. అదే విదంగా కేంద్ర మంత్రివర్గం నూరు శాతం కేంద్రప్రభుత్వ నిధులతో 6 వేల 839 కోట్ల రూపాయల మొత్తం వ్యయంతో రెండవ దశ వైబ్రంట్ విలేజెస్ కార్యక్రమానికి కూడా ఆమోదం తెలిపిందన్నారు. అంతర్జాతీయ భూ సరిహద్దుల వద్ద ఉన్న గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశాన్ని పురస్కరించుకొని సభ్య దేశాల నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ తో వేరు వేరుగా సమావేశమయ్యారు. అందులో బాగంగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశం వివరాలను భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రి వెల్లడిస్తూ సరిహద్దుల వద్ద అక్రమ చొరబాట్లను అడ్డుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ మహమ్మద్ యూనస్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. బంగ్లాదేశ్ లో మైనార్టీల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహమ్మద్ యూనస్ సూచించారని విక్రమ్ మిస్రి మాట్లాడుతూ ....

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

====================

రాజ్యసభ వక్ఫ్ (సవరణ) బిల్లు, 2025పై రికార్డ్ స్థాయిలో 17 గంటలకు పైగా చర్చ చేపట్టామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఇది చరిత్రలోనే అత్యధికమని అన్నారు. లోక్‌సభ కూడా ఈ బిల్లుపై దాదాపు 14 గంటల పాటు చర్చ నిర్వహించిందని ఆయన అన్నారు. పార్లమెంటులో బిల్లును బుల్‌డోజర్‌గా చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్ని నియమాలను విధానాలను అనుసరించి చట్టాన్ని ఆమోదించామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు.

====================

సామాజిక-ఆర్థిక న్యాయం, పారదర్శకత మరియు సమ్మిళిత వృద్ధి కోసం పార్లమెంటు వక్ఫ్ (సవరణ) బిల్లు, ముస్సల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లులను ఆమోదించడం ఒక కీలకమైన ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం లో పేర్కొన్నారు. వారసత్వ ప్రదేశాలను రక్షించడానికి మరియు సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి నిబంధనలతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం ఈ చట్టం లక్ష్యమని ప్రధానమంత్రి తెలిపారు.

====================

'స్థానిక అభివృద్ధి ప్రణాళికలో వాతావరణ అనుకూలతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం' అనే అంశంపై జాతీయ నీతి ఆయోగ్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలో ఈ రోజు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలలో వాతావరణ స్థితిస్థాపకతను సమగ్రపరచడానికి, వ్యూహాలను అన్వేషించడానికి వాతావరణ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, అభివృద్ధి నిపుణులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

====================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా లక్నో వేదికగా ఈరోజు లక్నో సూపర్ జెయిట్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయిట్స్ 11 ఓవర్లకు 3 వికెట్ నష్టానికి 108 పరుగులు చేసింది.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 295 పాయింట్లతో స్వల్ప నష్టాల్లో ప్రారంభమై... చివరికి 930 పాయింట్ల నష్టంతో 75 వేల 364 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345 పాయింట్ల నష్టంతో 22 వేల 904 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.22గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ భారీగా క్షీణించి 67.15 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3 వేల 118 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

====================
====================